సాక్షి
వికారాబాద్
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



కొండెక్కిన కోడి మాంసం

వేసవి సమీపిస్తున్న తరుణంలో చికెన్ ధరలు కొండెక్కాయి. రోజు రోజుకూ ధరలు పెరిగి కిలో రూ.270కి చేరింది. 8లో▸



వాగు దాటితేనే ఊరు చేరేది

తాండూరు రూరల్ మండల పరిధిలోని బిజ్వార్ అనుబంధ గ్రామమైన బొంకూర్ చుట్టూ వాగులు ఉన్నాయి. 8లో▸



'హరిత' లక్ష్యం బుగ్గిపాలు!

హరితహారం కార్యక్రమం అభాసుపాలవుతోంది. రోడ్ల పక్కల నాటిన మొక్కలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: జిల్లాలో ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచాలని ఆదేశించారు. జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, కేంద్రాల్లోకి సెల్ ఫోన్, ఎలక్ట్రికల్ వస్తువుల అనుమతి ఉండదని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

పాలిసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పాలిసెట్ -2024 పరీక్షకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పాలిసెట్ కన్వీనర్ పరమేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫారం ఫీజు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250,ఇతరులకురూ.500లుగా ఉంటుందని తెలిపారు. వి కారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొంపల్లి ప్ర భుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీ రింగ్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఒక్కో విభాగంలో 60 సీట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతగిరి: ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు న్యాయ పోరాటం చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణచివేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ విమర్శించారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తోందని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ధరణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాల్‌రెడ్డి, నాయకులు బషీర్ అహ్మద్, పీర్ మహ్మద్, వెంకటేశ్, సురేష్, అనంతయ్య, నర్సింలు, అబ్దుల్లా, చంద్రయ్య, రాజు, శ్యాం, జగదాంబ, పుష్ప, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

సీఎం రేవంత్‌ను కోరిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డికి బొకే అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిధులు మంజూరు చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారంలో నియోజకవర్గ ప్రజలకు పలు హామీలు ఇచ్చానని సీఎంకు తెలిపారు. రోడ్లు మెరుగు పర్చడంతో పాటు గ్రామాలలో మౌలిక వసతులు కల్పిస్తానని వాగ్దానం చేశానన్నారు. దీనికి కావాల్సిన నిధులు మంజూరు చేసేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ అధికార ప్రతినిధి కల్వ సుజాత తదితరులున్నారు.



విగత జీవులుగా పడివున్న భార్యాభర్త

నిర్లక్ష్యానికి నిండుప్రాణాలు బలి

విద్యుదాఘాతంతో దంపతుల దుర్మరణం

- దుస్తులు ఆరేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత
- వారం రోజులుగా కాలనీ మొత్తానికి షార్ట్ సర్క్యూట్
- ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోని సిబ్బంది, ఏఈ

బొంరాస్‌పేట: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి అమాయక దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మండలంలోని బురాన్‌పూర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల వివరాల మేరకు.. గ్రామంలోని వీరన్నపురం కాలనీకి చెందిన బోయిని లక్ష్మణ్(48), బోయిని లక్ష్మి(43) వ్యవసాయం పనులు చేసుకొని జీవిస్తున్నారు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. కూతురు సుజాతకు వివాహం చేయగా, కొడుకు సిద్ధు డిగ్రీ చదువుతున్నాడు. ఎప్పటిలాగే ఉదయాన్నే ఇంటి పనులు చేసుకుంటున్న లక్ష్మి దుస్తులు ఉతికేసి, రేకుల షెడ్‌లోని తీగపై ఆరేస్తుండగా ఒక్కసారి షాక్‌కు గురైంది. ఇది గమనించిన లక్ష్మణ్ ఆమెను విడిపించే టెన్షన్‌లో లక్ష్మిని పట్టుకున్నాడు. హై ఓల్టేజీ షాక్ కొట్టడంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రవూఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని అన్న రాంచంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ విషయమై వివరణ అడిగేందుకు ఏఈ నాగరాజుకు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. ఇదిలా ఉండగా లక్ష్మణ్ దంపతుల అంత్యక్రియలకు హాజరైన బంధువు గడిసింగాపూర్ వెంకటమ్మ సైతం ఇదే ఇంట్లో విద్యుదాఘాతానికి గురవడంతో వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



లక్ష్మి(ఫైల్)



లక్ష్మణ్ (ఫైల్)

వారం రోజులుగా షాక్

వీరన్నపురం కాలనీకి వారం రోజులుగా హైఓల్టేజీ విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసినా సమస్యను పరిష్కరించలేదని తెలిసింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పోలెపల్లి గోపాల్, కుదురుమళ్ల రాజుగౌడ్, నాచారం నారాయణ, బుడుగజంగం రాములు తదితరుల కుటుంబాలు కరెంటు షాక్ బారినపడ్డాయి. ఈ విషయాన్ని ఏఈ ఏఈ నాగరాజుకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు మండిపడ్డారు.

ఏఈ పట్టించుకోలేదు



స్విచ్ ఆఫ్ చేసినా కరెంటు సరఫరా అవుతున్నట్లు టెస్టర్‌లో చూపిస్తోంది. ఈ విషయాన్ని కరెంటు సిబ్బందికి, ఏఈ నాగరాజుకు విన్నవించాం. కానీ ఇప్పటి వరకు పట్టించుకోలేదు. సకాలంలో స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదు.

– రాజుగౌడ్, కాలనీవాసి

షాక్ కొట్టడంతో..



ఇంట్లో రాత్రిపూట సెల్ ఫోన్ చార్జింగ్ పెట్టా. అంతలో రింగ్ రావడంతో ఫోన్ తీస్తుండగా షాక్ కొట్టి.. కొద్ది దూరంలో ఎగిరి పడ్డా. స్పృహ కోల్పోయిన నన్ను చూసి అమ్మ అరుపులు వేసింది. చుట్టుపక్కల వారు వచ్చి నీళ్లు చల్లడంతో తేరుకున్నా.

– బుడగజంగం రాములు

నీళ్లకు కరెంటు షాక్



ఇంట్లో ఏ వస్తువును ముట్టుకున్నా జలజల్ మని షాక్ వచ్చింది. గోడలు, నీళ్లను తాకినా షాక్ వచ్చింది. మినీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సమస్య ఉందని తెలిసినా కరెంటోళ్లు పట్టించుకోలేదు. ఈ పాపం వారికే తగులుతుంది.

– చంద్రమ్మ, కాలనీవాసి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

రూ.24.35 కోట్లతో అభివృద్ధి పనులు

వికారాబాద్ రైల్వే జంక్షన్ పనులను వర్చువల్ పద్ధతిన ప్రారంభించిన ప్రధాని మోదీ



మాట్లాడుతున్న ప్రధాని మోదీ

అనంతగిరి: అమృత్ భారత్ స్టేషన్ కింద ఎంపికైన వికారాబాద్ జంక్షన్ అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్ పద్ధతిన ప్రారంభించారు. రూ.24.35 కోట్ల విలువ చేసే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రైల్వే స్టేషన్‌ను ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతారన్నారు. ప్రయాణికుల విశ్రాంతి కోసం ఏసీ గదులు, మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ప్లాట్ ఫాం పొడగింపు, మరుగుదొడ్ల నిర్మాణం, ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ హాల్స్, అత్యాధునిక పద్ధతిలో స్టేషన్ ముఖచిత్రం, ఎక్సలేటర్, లిఫ్ట్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రైల్వే స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ మాధవరెడ్డి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: మత్స్యకారులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ మత్స్యకార కార్మిక సంఘం(టీఎంకేఎంకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామం నాగులమ్మ చెరువులో రెండు రోజులుగా రూ.10లక్షల విలువైన చేపలు మృత్యువాత పడ్డాయి. విషయం తెలుసుకున్న టీఎంకేఎంకేఎస్ నాయకులు సోమవారం చెరువును సందర్శించారు. చనిపోయిన చేపలను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ.. చేపలు మృత్యువాతపడడానికి కారణాలను తెలుసుకునేందుకు చెరువు నీటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయాలని కోరారు. ఈ చెరువుపై ఆధారపడి వంద కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. చేపల చనిపోవడంతో తాము వృత్తిని కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యశాఖ అధికారులు చెరువును సందర్శించి ఇన్సూరెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు భిక్షపతి, ఉపాధ్యక్షుడు బత్తెం భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న సునీతారెడ్డి

ఎవరి పంతం వారిదే..!

- ఇటీవల బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్‌లో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్
- ముగ్గురు జెడ్పీటీసీలతో స్టాండింగ్ కమిటీ సమావేశం
- హాజరు కాని 14 మంది బీఆర్ఎస్ సభ్యులు
- ఏడింటిలో రెండింటిపైనే చర్చ

వికారాబాద్: పంతం నీదా.. నాదా అన్నట్లు తయారైంది జిల్లా పరిషత్ పరిస్థితి. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు ఎలా ఉన్నా ఎవరి పంతం వారు నెగ్గించుకునేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ తరఫున జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన పట్నం సునీతారెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడం, ఆ మరుసటి రోజే బీఆర్ఎస్ జెడ్పీటీసీలు కలెక్టర్‌ను కలిసి అవిశ్వాసం నోటీసు ఇవ్వడం చకచకా జరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి స్టాండింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం, ఆ సమావేశానికి బీఆర్ఎస్ జెడ్పీటీసీలు ఎవరూ హాజరు కాకపోవడం చర్చకు దారి తీసింది.

ముగ్గురు సభ్యులతో సమావేశం

జిల్లాలో 18 జెడ్పీటీసీ స్థానాలు ఉండగా వికారాబాద్, బంట్వారం, కోట్‌పల్లి స్థానాలను కాంగ్రెస్ మద్దతుదారులు, మిగిలిన 15 స్థానాలను బీఆర్ఎస్ మద్దతుదారులు గెలుపొందారు. కోట్‌పల్లి నుంచి గెలిచిన సునీతారెడ్డిని చైర్‌పర్సన్‌గా, మోమిన్‌పేట జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌కుమార్ వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆ తర్వాత వికారాబాద్ జెడ్పీటీసీ సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో ఆ పార్టీ బలం రెండుకు పడిపోయింది. చైర్‌పర్సన్ బీఆర్ఎస్ సభ్యురాలు కావడంతో వైస్ చైర్మన్, ఏడు స్టాండింగ్ కమిటీల చైర్మన్లు సైతం ఆ పార్టీ వారికే కట్టబెట్టారు. అయితే ఇటీవల సునీతారెడ్డి తోపాటు బషీరాబాద్ జెడ్పీటీసీ బీఆర్ఎస్ వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో వారి సంఖ్య నాలుగుకు పెరిగింది. ఓ పక్క బీఆర్ఎస్ జెడ్పీటీసీలు అవిశ్వాసం కోసం పట్టుబడుతుంటే చైర్‌పర్సన్ సోమవారం స్థాయీ సంఘాల సమావేశం ఏర్పాటు చేయడం, ముగ్గురు సభ్యులే హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఏడు స్థాయీ సంఘాలపై సమీక్ష నిర్వహించాల్సి ఉండగా కేవలం సాంఘిక సంక్షేమం, పెండింగ్ పనులపై మాత్రమే సమీక్ష చేసి మమ అనిపించారు. వ్యవసాయ స్థాయీ సంఘానికి విజయ్‌కుమార్, విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ స్థాయీ సంఘానికి సుజాత, సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘానికి అరుణ దేశాయ్ చైర్మన్లుగా ఉండగా వారెవరూ సమావేశానికి హాజరు కాలేదు. సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ అరుణదేశాయ్ హాజరు కానప్పటికీ ఆ సంఘంపై సమీక్ష నిర్వహించడం గమనార్హం. ముగ్గురు జెడ్పీటీసీలతో సమావేశం ఏర్పాటు చేసి చైర్‌పర్సన్ పంతం నెగ్గించుకోగా.. తామూ తగ్గేది లేదంటూ బీఆర్ఎస్‌కు చెందిన 14 మంది జెడ్పీటీసీలు సమావేశానికి డుమ్మా కొట్టారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 455 పనులను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని పట్నం సునీతారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ కింద రూ.14 కోట్లతో చేపట్టిన 428 పనులు, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.4.87 కోట్లతో చేపట్టిన 156 పనుల్లో 27 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఈ పనులు మార్చి చివరి నాటికి పూర్తి కావాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు.జెడ్పీ సీఈఓ సుధీర్, జెడ్పీటీసీలు ధారాసింగ్, సంతోష, శ్రీనివాస్‌రెడ్డి ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రచార రథాలు రెడీ

తాండూరు: పార్లమెంట్ ఎన్నికల కోడ్ వెలువడక ముందే ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇప్పటికే సోషల్ మీడియా వేదిక చేసుకొని ఆయా పార్టీలకు చెందిన ఆశావహులు తమ వాలంటీర్లతో అనుకూలంగా పోస్టులు పెట్టించుకొంటూ హల్‌చల్ చేస్తున్నారు. తాజాగా చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఎన్నికల ప్రచార రథాలు తాండూరుకు చేరుకుని ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. ఎన్నికల కోడ్ కూయక ముందే బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఆశావహులు ఇప్పటి నుంచే ఎన్నికల యుద్ధానికి సైఅంటూ కదం తొక్కుతున్నారు.



తాండూరుకు చేరిన ప్రచార రథాలు

ఆర్థిక అక్షరాస్యతపై

అవగాహన కల్పించండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బ్యాంక్ అధికారులు

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు జరగనున్న వారోత్సవాల పోస్టర్‌ను బ్యాంక్ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. 28, 29 తేదీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 29న తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే అవగాహన కార్యక్రమంలో వ్యాసరచన,నినాదాలు, పోస్టర్ విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేయనున్నట్లు తెలిపారు. పోస్టర్‌లో పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలని, ఆర్థిక లాభాలను ఆర్జించాలని, సైబర్ స్మార్ట్ అవ్వాలని పొందుపరిచారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు, వివిధ బ్యాంకుల మేనేజర్లు శ్రావణి, గంగాధర్, శ్రుతి, మమత, సర్వరాజ్, హఫీజ్ నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 173 ఫిర్యాదులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు, ఆసరా పెన్షన్లు, పంచాయతీ రాజ్, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్, మెడికల్ డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీస్, ఈఈ పీఆర్ ఇంజనీరింగ్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ అధికారి మల్లేశం ,జిల్లా సర్వే ల్యాండ్ ఆఫీసర్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

అడిగిన వారికి డబ్బులు వాపస్!



గొర్రెల పథకంపై నీలినీడలు

- తమ వాటాను వడ్డీతో తిరిగి చెల్లించాలంటున్న లబ్ధిదారులు
- జిల్లాలో డీడీలు కట్టిన 8,413 మంది గొల్లకుర్మలు
- పథకం అమలయ్యింది 722 మందికే..

వికారాబాద్ అర్బన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొల్ల కుర్మల ఆర్థిక ఎదుగుదల కోసం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందా..? లేదా అనే దానిపై స్పష్టత కొరవడింది. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో లబ్ధిదారుల్లో పథకం అమలుపై అనుమానం ఉంది. దీంతో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం చెల్లించిన డీడీ డబ్బులు తిరిగి ఇవ్వాలని కొందరు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అడిగిన వారికి డబ్బులు వాపస్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో 8,413 మంది గొల్లకుర్మలు గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించారు. మొదటి విడతలో 722 మందికి 722 యూనిట్లు మంజూరు చేశారు. మొదటి విడత సక్సెస్ కావడంతో రెండో విడతకు భారీగానే దరఖాస్తులు వచ్చాయి. రెండో విడతలో గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం డీడీలు కట్టాలని గత ప్రభుత్వం కోరడంతో జిల్లాలో సుమారు 7,691 మంది ఒక్కొక్కరు తమ వాటా ధనంగా రూ. లక్ష 75వేల విలువ చేసే డీడీ చెల్లించారు. 20 గొర్రెలు, ఒక పొట్టేలు కలిపి ఒక యూనిట్ కింద ఇస్తారు. ఇందులో లబ్ధిదారుడి వాటా కింద రూ. 43,750 చెల్లిస్తే మిగతా డబ్బులను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఇస్తుంది. అయితే రెండో విడత యూనిట్లకు డీడీలు చెల్లించి ఏడాదికి పైగా కావస్తున్నా నేటికీ యూనిట్లు మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం ఎన్నికలకు ఏడాది ముందు నుంచే గొర్రెల పంపిణీపై స్పందించడం మానేసింది.

ప్రభుత్వం మారడంతో..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా గొర్రెల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో లబ్ధిదారులు తాము కట్టిన డబ్బులకు వడ్డీ పెరిగిపోతోందని, తిరిగి ఇవ్వాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. మొదటి విడత గొర్రెల యూనిట్ల పంపిణీలో అనేక అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. జిల్లాలో కూడా అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రెండో విడతలో కూడా అనేక మంది అనర్హులు ఈ పథకం లబ్ధి కోసం డీడీలు చెల్లించినట్లు విమర్శలు వచ్చాయి. ఇలాంటి పరిస్థితిలో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ జోలికి పోతే లేని పోని ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్లు అవుతుందని రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు భావిస్తున్నట్లు సమాచారం. జిల్లాలో ఎవరైనా డీడీలు తిరిగి ఇవ్వమని ఒత్తిడి చేస్తే ఇచ్చేయాలని ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు అందినట్లు తెలిసింది. ఎవరైనా డీడీలను విత్‌డ్రా చేసుకోవాలనుకుంటే రాత పూర్వకంగా దరఖాస్తు ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులు, గొల్లకురుమ సంఘాలకు సూచిస్తున్నారు. విత్‌డ్రా కోసం దరఖాస్తులను చేసుకున్న వారికి రెండు వారాల్లోపు డబ్బులను తిరిగి చెల్లించనున్నట్లు సమాచారం.

వడ్డీ భారం

గొర్రెల యూనిట్ల కోసం రెండేళ్ల క్రితం అప్పులు చేసి డీడీలు కడితే తిరిగి తమకు డబ్బులే ఇస్తే వడ్డీ మీద పడుతుందనే గొల్లకుర్మల్లో ఆందోళన నెలకొంది. తాము చెల్లించిన డీడీలకు ఏడాదికి కనీసం రూ. 15 వేల వరకు వడ్డీ మీదపడుతుందని అంటున్నారు. ప్రభుత్వం వడ్డీతో సహా చెల్లించాలని అంటున్నారు.

దరఖాస్తు చేస్తే డబ్బులు ఇస్తాం



వడ్డీ భారం మీద పడుతుందని, ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని తమకు దరఖాస్తు చేసుకునే వాళ్లకు మాత్రమే వారు చెల్లించిన డీడీ డబ్బులు తిరిగి చెల్లిస్తున్నాం. గొర్రెల పంపిణీ పథకంపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. గొల్లకుర్మలను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతోనే వారు చెల్లించిన డబ్బులను తిరిగి ఇస్తున్నాం.

–అనిల్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

క్లుప్తంగా

ఉద్యోగోన్నతి కల్పించాలి

అంగన్‌వాడీ హెల్పర్లు

అనంతగిరి: పది పాసైన అంగన్‌వాడీ హెల్పర్లందరికీ ఉద్యోగోన్నతి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్‌ కలెక్టర్‌ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9వేలకు పైగా హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. రిటైర్‌మెంట్‌ బెనిఫిట్స్‌ రూ.20లక్షలు ఇవ్వాలన్నారు. పెన్షన్‌ సౌకర్యం రూ.10వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సమ్మ, రామకృష్ణ, లక్ష్మి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ధర్నా అనంతరం ముఖ్య నాయకుల సమావేశంలో యూనియన్‌ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా అనూష, భారతి, ఇంపియాజ్‌ బేగం, భాగ్యశ్రీ, కవిత, అశ్విని, ప్రధాన కార్యదర్శిగా అంగమ్మ, సహాయకార్యదర్శిగా శారద, శ్యామల, అనిత, లక్ష్మి, లలిత, మమత, భారతి, కమిటీ సభ్యులుగా సంతోష, శ్యామల, రాజశ్రీ, యాదమ్మ, బాలమణి తదితరులను ఎన్నుకున్నారు.

క్రమబద్ధీకరణ కోసం సీఎంకు వినతి

ఐఈఆర్‌పీ ఉద్యోగులు



సీఎంను కలిసిన ఐఈఆర్‌పీ ఉద్యోగులు

బొంరాస్‌పేట: మండల స్థాయిలో ఐఈఆర్‌పీ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించాలని కోరడంతో సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని టీఎస్‌ ఐఈఆర్‌పీ యూనియన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌ తెలిపారు. సోమవారం పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఐఈఆర్‌పీ యూనియన్‌ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం సీఎం కలిశామన్నారు. అనంతరం ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి సమస్యను విన్నవించామన్నారు. దీనిపై చిన్నారెడ్డి స్పందించి ప్రస్తుతం ఈ సమస్య విచారణలో ఉందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్‌, జిల్లా నాయకులు వెంకట్రాములు, స్వప్న, సువర్ణమాల ఉన్నారు.

మండల కాంగ్రెస్‌ నేతలు

సీఎం రేవంత్‌రెడ్డిని మండల పరిధిలోని ఏర్పుమళ్లకు చెందిన కోస్గి మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ వెంకట్రాములుగౌడ్‌, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహులు గౌడ్‌ తదితరులు కలిసి అభినందనలు వ్యక్తం చేశారు.

కలప పట్టివేత



అక్రమంగా కలపను తరలిస్తున్న లారీ

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అక్రమంగా కలప తరలిస్తున్న లారీ, ట్రాక్టర్‌లను పట్టుకున్నారు. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న వాహనాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి వాహనాలను స్వాధీనం చేసుకొని కలపను అటవీశాఖ సిబ్బందికి అప్పజెప్పినట్లు వివరించారు. అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు.

గ్యారంటీల అమలు పక్కా

షాబాద్‌: ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తామని మహిళా కాంగ్రెస్‌ జిల్లా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్‌, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ ఏ–బ్లాక్‌ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మన్మర్రి గ్రామంలో మహిళ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్లమెంట్‌ ఎన్నికల్లో పార్టీ సత్తాచాటుతుందన్నారు. గడిచిన తొమ్మిదేళ్లలో పాలకులు అభివృద్ధిని మరిచారని, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

కొండెక్కిన కోడి మాంసం

- ఎండలు మండుతున్నా తగ్గని చికెన్‌ ధరలు
- పౌల్ట్రీ నిర్వాహకుల సిండికేట్‌ వ్యాపారం



పరిగి: వేసవి సమీపిస్తున్న తరుణంలో చికెన్‌ ధరలు కొండెక్కాయి. రోజు రోజుకు ధరలు పెరుగుతూ ప్రస్తుతం రూ.270కి చేరి సామాన్యులకు భారంగా మారింది. వారం రోజుల వ్యవధిలోనే డిమాండ్‌ కారణంగా భారీగా రేట్లను పెంచుతున్నారు. వినియోగాన్ని దృష్టిలో ఉంచుకొని వ్యాపారులు మూకుమ్మడిగా రేట్లు పెంచుతున్నట్లు ఆరోపణలున్నాయి. కానీ, ధరలు పెరగడానికి కారణం కోళ్లకు వేసే మేత, నిర్వహణ ఖర్చులు అధికమైనట్లు వ్యాపారులు చెబుతున్నారు. గత నెల నుంచి వేసవి పూర్తయ్యే వరకు వరుసగా పెళ్లిళ్లు ఉండటంతో రేట్లు పెరుగుతున్నాయంటున్నారు. స్థానికంగా లభ్యత తక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి దాణాలను దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. కోడి గుడ్డు ధర మాత్రం వినియోగదారులకు కొంత మేర ఊరటనిస్తుందని చెప్పవచ్చు.

గతానికి భిన్నంగా..

జిల్లా వ్యాప్తంగా సాధారణంగా రోజుకు దాదాపుగా 1.7 లక్షల కిలోల మేర చికెన్‌ వినియోగిస్తున్నట్టు వ్యాపారస్తులు చెబుతున్నారు. ఆదివారం, ఏదైనా పండగ ఉంటే ఆ రోజు రెట్టింపు స్థాయిలో అమ్మకాలు జరుగుతాయని అంచనా. కానీ పెళ్లిళ్ల సీజన్‌ కావడంతో అంచనాలకు మించి వ్యాపారం సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా లక్షలకు పైగా బ్రాయిలర్‌ కోళ్ల పెంపకం జరుగుతుంది. 40 రోజుల్లో బ్రాయిలర్‌ కోళ్లు వినియోగానికి సిద్ధమవుతుంటాయి. సంవత్సరం పొడవునా చికెన్‌ వ్యాపారాలు జోరందుకున్న ఎండలు తీవ్రత కారణంగా మందకొడిగా సాగుతుండేవి. మిగతా నెలలతో పోలిస్తే ఫిబ్రవరి నుంచి ఐదు నెలల పాటు చికెన్‌ వినియోగం తగ్గుతుంది. దీంతో రేట్లు కూడా తగ్గుముఖం పడుతుంటాయి. కానీ ఈసారి వేసవి ప్రారంభం కాకముందే ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న కొద్దీ చికెన్‌ ధరలు సైతం పెరుగుతుండటం గమనార్హం.

శుభకార్యాలతో గిరాకీ

కోళ్లకు వేసే మేత ధరలు అదుపులోకి రాకపోవడం, వేసవిలోనూ అధికంగా పెళ్లిళ్లు ఉండటం, వినియోగానికి తగ్గా ఉత్పత్తి లేకపోవడంతో చికెన్‌కు బాగా డిమాండ్‌ పెరిగింది. మేతలో ప్రధానమైన సోయాబిన్‌, మొక్కజొన్న తదితర పంటల రేటు భారీగా పెరిగాయి. వేసవి కారణంగా చాలా మంది రైతులు కోళ్ల ఫారాల్లో కోళ్ల పెంపకం కోసం కొత్త బ్యాచ్‌లను వేయలేదు. దీంతో కోళ్ల పెంపకం తగ్గడంతో రేట్లు పెరిగాయి. ఏటా ఈ సమయంలో చికెన్‌ రేటు గణనీయంగా తగ్గుతుండేది. కానీ ఈసారి ధర పెరుగుతుండటంతో వినియోగదారులపై భారం పడుతుంది. ఉత్పత్తి ఉన్న వ్యాపారస్తులు సిండికేట్‌ అయి రేటును పెంచుతున్నట్లు సమాచారం.

“వ్యాపారం చేయలేకపోతున్నాం



చికెన్‌ వినియోగం మాములుగానే ఉంది. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌ కావడంతో కొంతమేర గిరాకీ వస్తుంది. కానీ రెగ్యులర్‌ గిరాకీ లేక ఇబ్బందులు పడుతున్నాం. కంపెనీలు రేటును ఇష్టానుసారంగా పెంచడంతో వ్యాపారాలు జరగడం లేదు.

– రఫీక్‌, చికెన్‌ దుకాణదారుడు

కిలో రూ.300



చికెన్‌ ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కిలో రూ.300 వరకు అమ్ముతున్నారు. సక్రమంగా ఉపాధి దొరకక ఇబ్బంది పడుతున్న సమయంలో అంత ధర పెట్టి చికెన్‌ తినాలంటే భయం వేస్తుంది.

– చెన్నయ్య, ఐప్పాయిపల్లి

సమాజ సేవే ఐవీఎఫ్‌ లక్ష్యం

ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా



నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న శ్రీనివాస్‌ గుప్తా

తాండూరు టౌన్‌: సమాజ సేవ చేయడమే ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌(ఐవీఎఫ్‌) లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్‌, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌ మాజీ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఆర్యవైశ్య ఓపెన్‌ ఆడిటోరియంలో ఐవీఎఫ్‌ జిల్లా, తాండూరు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణానికి చెందిన రెండు నిరుపేద కుటుంబాలకు పుస్తె, మెట్టెలు, బట్టలు అందజేశారు. బాసుపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు వేముల సురేందర్‌ సహకారంతో రెండు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. గాజీపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌కు తరగతి గదుల్లో సీలింగ్‌ ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ.. ఐవీఎఫ్‌ ఆధ్వర్యంలో పేద ప్రజలకు పలు రకాలుగా సాయం అందజేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో సైతం ఈ సేవలు కొనసాగుతాయన్నారు. అనారోగ్యంతో ఉన్న నిరుపేద ఆర్యవైశ్యులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం ఐవీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి రొంపల్లి సంతోష్‌ కుమార్‌, ఉపాధ్యక్షులు రాజ్‌కుమార్‌, శ్రీకాంత్‌, ప్రధాన కార్యదర్శి శేషాద్రి, ఉప కార్యదర్శి హరీశ్‌, కోశాధికారి మహేశ్‌, తాండూరు కమిటీ అధ్యక్షుడిగా కల్వ జగదీశ్వర్‌, ఉపాధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి ప్రణయ్‌ చంద్ర, ఉప కార్యదర్శి రఘురామ్‌, కోశాధికారి సాయితేజ తదితరులచే శ్రీనివాస్‌గుప్తా ప్రమాణ స్వీకారం చేయించారు. పట్టణ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ స్వప్న, ఐవీఎఫ్‌ సభ్యులు చంద్రశేఖర్‌, రవి, నరేశ్‌, ఉప్పల స్వప్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అద్భుతం.. కన్హా శాంతివనం

- 14నుంచి 17వరకు ‘ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ్‌’
- కేంద్ర న్యాయ, సాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్‌ రామ్‌ మేఘవాల్‌



కోర్‌ కమిటీ సభ్యులతో కేంద్ర మంత్రి అర్జున్‌ రామ్‌ మేఘవాల్‌

నందిగామ: ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రమైన కన్హా శాంతివనం అద్భుతంగా ఉందని కేంద్ర న్యాయ, సాంస్కృతిక శాఖ మంత్రి అర్జున్‌ రామ్‌ మేఘవాల్‌ అన్నారు. మండలంలోని కన్హా శాంతి వనాన్ని సోమవారం సాయంత్రం ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. మార్చి14 నుంచి 17 వరకు కన్హాలో ‘ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ్‌’ వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ విషయమై కోర్‌ కమిటీ సభ్యులతో చర్చించినట్లు వెల్లడించారు. ప్రపంచ స్థాయి ఆధ్యాత్మిక సంబరాలకు శాంతివనం అనుకూలంగా ఉందని తెలిపారు.

భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మర్పల్లి: ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని చేవెళ్ల పార్లమెంట్‌ నియోజకవర్గం మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యదర్శి గొల్ల మల్లేశ్‌యాదవ్‌ నిర్వహించిన భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపడిపూజకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందూ సనాతన ధర్మం కోసం ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవర్చుకోవాలన్నారు. దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శేరి నర్సింగ్‌రావు, మాధవరెడ్డి, శివరాజ్‌, భాస్కర్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, లక్ష్మణ్‌, మధు శివ స్వాములు తదితరులు ఉన్నారు.

జన్మదిన వేడుకలు

మండల కేంద్రంలో మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌ రెడ్డి జన్మదిన వేడుకలను జస్టిస్‌ కొండా మాధవరెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. మర్పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో విశ్వేశ్వర్‌ రెడ్డి కేక్‌ కట్‌ చేసి విద్యార్థులకు తినిపించారు. ఈ సందర్భంగా గతేడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.2,500 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్‌ శేఖర్‌, సభ్యులు సంగమేశ్‌, ప్రశాంత్‌, పార్టీ శ్రేణులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

డీఎస్పీని వెంటనే సస్పెండ్‌ చేయాలి



అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజా సంఘాల డిమాండ్‌

దోమ: భూ వివాదంలో జోక్యం చేసుకొని అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కై ఓ వ్యక్తిని బెదిరించిన డీఎస్పీని వెంటనే సస్పెండ్‌ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం దోమ మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రానికి అనుబంధంగా ఉన్న ఉదన్‌రావుపల్లి గ్రామానికి చెందిన అయూబ్‌ తిమ్మాయిపల్లి గ్రామ పరిధిలోని సర్వేనంబర్‌ 50/ఏ/1లో ఎకరం తొమ్మిది గుంటల భూమిని 2018లో కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఖాస్తులో ఉన్నప్పటికి అధికార పార్టీకి చెందిన కొందరు నేతలు భూమిని ఆక్రమించి కబ్జాలకు పాల్పడి బాధితుడిని బెదిరింపులకు గురి చేశారన్నారు. దీనిపై బాధితుడు పరిగి డీఎస్పీని సంప్రదించారు. డీఎస్పీ అధికార పార్టీ నేతలకు వత్తాసు పలికి బాధితుడిపైనే బెదిరింపులకు గురి చేశాడని ఆరోపించారు. వెంటనే డీఎస్పీపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేని పక్షంలో ఈ నెల 4న కలెక్టర్‌, ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్‌ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌ నాయక్‌, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు సత్యయ్య, నాయకులు రఘురాం, సత్యయ్య, శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

15 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు అపహరణ

శంకర్‌పల్లి: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణ కేంద్రంలోని బ్లూడ్స్‌ కాలనీలో వెలుగుచూసింది. సోమవారం సీఐ వినాయకరెడ్డి తెలిపిన ప్రకారం.. కాలనీ వాసి సునీల్‌ ఈ నెల 22న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి మెయినాబాద్‌ వెళ్లాడు. గమనించిన దుండగులు తాళం పగులకొట్టి ఇంట్లో ఉన్న 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. 25న రాత్రి ఇంటికి వచ్చిన సునీల్‌ తాళం పగులగొట్టడంతో పాటుగా ఇంట్లో సామగ్రి చిందరవందరగా పడిఉండడంతో ఆదివారం రాత్రి శంకర్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హామీలను తప్పకుండా నెరవేరుస్తాం

ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మిగతా హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ కింద రూ.10లక్షలు అమలు చేశారన్నారు. మరో రెండు గ్యారంటీలను మంగళవారం చేవెళ్ల సభలో ప్రియాంక గాంధీ అమలు చేయనున్నారన్నారు. మహాలక్ష్మి పథకం కింద తెల్లరేషన్‌ కార్డు ఉన్న వారికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్‌, రూ.500లకే గ్యాస్‌ సిలిండర్‌ను ఇవ్వనున్నామన్నారు. త్వరలోనే మిగతా గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ మాయ మాటలను తిప్పికొట్టి కాంగ్రెస్‌ పార్టీకి అధికారాన్ని కట్టబెట్టారన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీలను ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు, ప్రజలు చేవెళ్లలో నిర్వహించే సభకు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్‌, ఆయా మండలాల అధ్యక్షులు పరశురాంరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, ఆంజనేయులు, అశోక్‌, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఆలయాన్ని దేవాదాయశాఖ ఆధీనంలోకి వెళ్లిన తరువాత సోమవారం ఆలయంలో ఈఓ ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా పార్థసారథి పంతులిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానన్నారు. ఆలయంలో భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను సమకూర్చేందుకు ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లికృష్ణ, భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి గాయాలు

ఆమనగల్లు: పట్టణంలోని హైదరాబాద్‌–శ్రీశైలం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఆమనగల్లు ఎస్‌ఐ బలరాం తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన నర్సింహ, యాదయ్య బైక్‌పై ఆదివారం ఆమనగల్లుకు వచ్చారు. తిరుగుప్రయాణంలో పెట్రోలు కోసం బంక్‌ వద్దకు వెళ్తుండగా తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట కల్వకుర్తి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ, యాదయ్యలు తీవ్రంగా గాయపడటంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నర్సింహ భార్య అలివేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



హరికృష్ణ (ఫైల్‌)

అబ్దుల్లాపూర్‌మెట్‌: గుడికి వెళ్తున్నానంటూ బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సోమవారం పోలీసులు తెలిపిన ప్రకారం... తారమతిపేట గ్రామానికి చెందిన దుబ్బ హరికృష్ణ (36) ఈ నెల 22న గురువారం మధ్యాహ్నం 3గంటల సమయంలో గ్రామంలోని బీరప్ప గుడికి వెళ్తున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. చీకటి పడినా ఇంటికి రాకపోవడంతో గ్రామ పరిసరాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతడి భార్య హేమలత సోమవారం అబ్దుల్లాపూర్‌మెట్‌ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కాగా అదృశ్యమైన వ్యక్తికి మతిస్థిమితం సరిగా లేదని, 20 రోజుల క్రితం ఎర్రగడ్డ ఆస్పత్రిలో ఆయనకు చికిత్స అందించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

వాగు దాటితేనే ఊరు చేరేది



బొంకూర్‌కు వెళ్లేందుకు వాగు దాటుతున్న బిజ్వార్‌ గ్రామస్తులు

వంతెన నిర్మించాలని బొంకూర్‌–బిజ్వార్‌ గ్రామస్తుల ఆవేదన

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని బిజ్వార్‌ అనుబంధ గ్రామమైన బొంకూర్‌ చుట్టూ వాగులు ఉన్నాయి. వర్షాకాలం వచ్చిందంటే వాగులు పొంగి పొర్లుతాయి. దీంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. అత్యవసరం అయితే ట్రాక్టర్‌పై రుక్మాపూర్‌ నుంచి తాండూరుకు వెళ్తుంటారు. వరద ఉధృతి పెరిగితే ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం బిజ్వార్‌–బొంకూర్‌ వాగు మీద వంతెన నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేసింది. మాజీ ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి శంకుస్థాపన కూడా చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం గత ప్రభుత్వంలో ఇచ్చిన అభివృద్ధి పనులను రద్దు చేసింది. దీంతో బిజ్వార్‌–బొంకూర్‌ వంతెన నిర్మాణం పూర్తి అవుతుందా లేదా అనే అనుమానాలను గ్రామస్తులు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం బొంకూర్‌లో శివాలయంలో పూజలు ముగించుకొని బిజ్వార్‌ గ్రామస్తులు ఇలా వాగు దాటుతున్నారు.

కొడంగల్‌ మున్సిపల్‌ బడ్జెట్‌ ఆమోదం

రూ.41.38 కోట్ల అంచనా



మున్సిపల్‌ బడ్జెట్‌ సమావేశం

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని వెటర్నరీ హాస్పిటల్‌ హాల్‌లో సోమవారం మున్సిపల్‌ చైర్మన్‌ ఆర్‌.జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన మున్సిపల్‌ ప్రత్యేక బడ్జెట్‌ సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.41.38 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. ఇందులో రూ.41.32 కోట్ల ఖర్చులు పోను రూ.6 లక్షల మిగులు బడ్జెట్‌ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్‌ సిబ్బందితో కలిసి ప్రజాప్రతినిధులు పట్టణంలోని కాలనీలలో మురుగు కాల్వల నిర్మాణంతోపాటు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. పాతకొడంగల్‌తండా, గుండ్లకుంట తదితర గ్రామాల్లోని కాలనీల్లో ప్రజలతో ముచ్చటిస్తూ అవసరమైన మేరకు త్వరితగతిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ ఉషారాణి, మున్సిపల్‌ కమిషనర్‌ బలరాంనాయక్‌, ఏఈ రాకేష్‌రెడ్డి, మున్సిపల్‌ కౌన్సిలర్లు, కోఆప్షన్‌ మెంబర్లు, పీఏసీఎస్‌ చైర్మన్‌ కటుకం శివకుమార్‌, నాయకులు మురారి తదితరులు పాల్గొన్నారు.

స్వయం పాలనలో విద్యార్థులు



దుద్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా ఝాన్సీ, ఎంఈఓగా వెంకటప్రసాద్‌, హెచ్‌ఎంగా శశివర్ధన్‌తోపాటు 37మంది ఉపాధ్యాయులుగా విధులు చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, నిత్యం క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నెహ్రూ చౌహాన్‌, ఉపాధ్యాయులు మల్లప్ప, సుధాకర్‌రావు, వెంకటయ్య, శిల్ప, శ్రీకాంత్‌, శ్రీనివాస్‌, రాములున్నారు.

డీప్లానాయక్‌తండాలో..

స్వయం పరిపాలనలో సోమవారం కలెక్టర్‌గా గణేశ్‌, డీఈఓగా పి.రాధిక, ఎంఈఓగా శివ, హెచ్‌ఎంగా నితిన్‌, పీఈటీ ఎస్‌.నితిన్‌తోపాటు ఉపాధ్యాయులుగా రాధిక, సంగీత, అమృత, నితిన్‌, దివ్య, ఇందు, మీనాక్షి, సంధ్య, శిరీష విధులు నిర్వహించారు.

'ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరిస్తున్నాం'

రాజేంద్రనగర్: ప్రజావాణికి వచ్చిన ప్రతి ఫిర్యాదును సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవి కుమార్ వెల్లడించారు. జీహెచ్ఎంసీ విభాగంలోని వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన సోమవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై తగు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల్ బుద్వేల్ సర్వే నంబర్ 424లోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణాలను రెవెన్యూ అధికారులు సోమవారం కూల్చివేశారు. ఉదయం రెవెన్యూ అధికారులు బుద్వేల్ ప్రాంతానికి చేరుకొని నాలుగు కట్టడాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. కూల్చివేతల నేపథ్యంలో రాజేంద్రనగర్ పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ..ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని వెల్లడించారు. ఎలాంటి నిర్మాణాలైనా కూల్చివేస్తామని హెచ్చరించారు.

ట్రాఫికర్

అడ్డా కూలీలతో రోజు భారీగా ట్రాఫిక్ జామ్

- అడ్డా మార్చినా అక్కడికి వెళ్లని కూలీలు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ సిబ్బంది



కాళీమందిర్ చౌరస్తాలో రోడ్డుపైనే అడ్డా కూలీలు

బండ్లగూడ: కాళీమందిర్ చౌరస్తా నుంచి ఉదయం వేళల్లో హైదరాబాద్, చేవెళ్ల, పర్గి, వికారాబాద్, తాండూర్, కొడంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు రోడ్డుపై అడ్డా కూలీలతో ఇబ్బందిగా మారుతోంది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో వారి సమయం వృథా అవుతోంది. గండిపేట్ మండలం బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భవన నిర్మాణ కార్మికులతో పాటు దినసరి పనులు చేసే అనేక మంది కూలీలకు ప్రత్యేకంగా ఒక స్థలం అంటూ లేకపోవడంతో ప్రతిరోజూ ఉదయం సమయంలో రోడ్డుపై వచ్చి నిలుచుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాళీమందిర్ చౌరస్తా ప్రధాన రహదారిపై పని ఉందా అంటూ వచ్చిపోయే వారిని అడుగుతూ రోడ్డుపైనే అడ్డా కూలీలు అడ్డా వేయడంతో ట్రాఫిక్ సమస్య తీవ్ర మవుతుంది.

రోడ్డుపైనే వ్యాపారాలు..

దీనికి తోడుగా కాళీమందిర్ చౌరస్తాలో తోపుడు బండ్లపై చిరు వ్యాపారాలు జరిపే వారు కూడా రోడ్డుపైనే వ్యాపారాలు పెట్టడంతో సమస్య మరింత తీవ్రమవుతుంది. పండ్ల విక్రయాలు తదితర వ్యాపారాలు రోడ్డుపై జరపడంతో ఈ రహదారిలో తరచూ ట్రాఫిక్‌జాం ఏర్పాడి పలు ప్రమాదాలకు దారి తీస్తుంది.

రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ జామ్..

రోజు రోజుకూ ఇక్కడ నిర్మాణాలు భారీగా పెరుగుతుండటంతో అదే రీతిలో దినసరి కూలీలు కూడా కాళీమందిర్ ప్రాంతంలో బాగానే నివాసముంటారు. రోజు కూలీ పనులు చేసే



గతంలో కూలీలతో మాట్లాడుతున్న ట్రాఫిక్ అధికారులు (ఫైల్)

కొనే భవన నిర్మాణం, పెయింటింగ్, సెంట్రింగ్ తదితర పనులు చేసుకుంటూ జీవనంసాగించే దినసరి కూలీలు ఉదయం సమయంలో ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది.

గతంలో అడ్డాను మార్చినా ఫలితం మాత్రం శూన్యం..

నార్సింగి ట్రాఫిక్ పోలీస్ అధికారులు గతంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రోడ్డుపైన కూలీలు నిలవకుండా వారితో మాట్లాడి లేబర్ అడ్డాను రోడ్డు పక్కల గల బ్రాడ్‌వే ఏరియాలోకి అడ్డాను మార్చారు. కూలీలు రోడ్డు దాటేందుకు వీలుగా అక్కడ టెలికాన్ సిగ్నల్ కూడా ఏర్పాటు చేశారు. కానీ అడ్డా కూలీలు మాత్రం బ్రాడ్‌వేలోని ప్రాంతంలోకి వెళ్లడం లేదు. రోడ్డుపైనే ఉండి ట్రాఫిక్‌జాం చేస్తున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ సిబ్బంది..

రోజువారి కూలీలు రోడ్డుపైకి వచ్చి ట్రాఫిక్ జామ్ కాకుండా ఉండేందుకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ అధికారులు గతంలో రోజువారి కూలీలకు ఏర్పాటు చేసిన బ్రాడ్‌వే ఏరియాలో ఉండేవిధంగా తగు చర్యలు చేపట్టాల్సిందిగా, తోపుడు బండ్ల విక్రయదారులను రోడ్డుపై రాకుండా చూడాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వర్చువల్‌గా పనులు ప్రారంభించిన ప్రధాని మోదీ



ఉందానగర్ రైల్వేస్టేషన్ పనులు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని నరేంద్రమోదీ
- రూ.12.5 కోట్లతో రైల్వేస్టేషన్ ఆధునీకరణ



రైల్వే డివిజనల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 15 రైల్వే స్టేషన్‌లు అమృత్ భారత్ రైల్వే స్టేషన్‌లుగా ఎంపికైన వాటిలో ఒకటైన ఉందానగర్ (శంషాబాద్) ఆధునీకరణ పనులను భారత ప్రధాని నరేంద్రమోదీ సోమవారం మధ్యాహ్నం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రైల్వే డివిజనల్ మేనేజర్ లోకేష్ హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్‌లను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతుందన్నారు. త్వరలోనే ఉందానగర్ రైల్వేస్టేషన్‌లో అన్ని రకాల ఏర్పాట్లు కానున్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, పెయింటింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కొలను సుష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు అజయ్, శ్రీకాంత్‌యాదవ్, సంజయ్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, బుక్కవేణుగోపాల్, దేవేందర్, మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

సమస్యలపై విన్నపం..

ఉందానగర్ రైల్వేస్టేషన్ పేరును శంషాబాద్‌గా మార్చడంతో పాటు అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఉందానగర్‌లో ఆగే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు డివిజనల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. స్థానికంగా తత్కాల్ సౌకర్యం కూడా కల్పించాలన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మంజూరైన రైల్వే స్టేషన్ కూడా త్వరగా నిర్మాణం చేయాలని కోరారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

మణికొండ: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నార్సి ంగి మున్సిపల్ కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోకాపేటలోని డ్వాక్రా భవనంలో సయోధ్య హోం ఫర్ ఉమెన్ ఇన్ నీడ్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌ల సహకారంలో మహిళలకు వంటలలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఆయన కౌన్సిలర్‌లు జి.శివారెడ్డి, ఎ.దుర్గేష్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చి నివసించే ఐటీ, ఇతర రంగాల్లో ఉద్యోగులు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఇంట్లో తయారు చేసిన వంటకాలను ఎక్కువ డబ్బు ఇచ్చి కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, డ్వాక్రా గ్రూపు మహిళలంతా కలిసి ఓ వంటశాలను ఏర్పాటు చేసుకుని స్విగ్గీ లాంటి ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వాటిని విక్రయిస్తే ఆర్థికంగా రాణించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, శానిటేషన్ సూపర్‌వైజర్ మహిపాల్, ఆయా సంస్థల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



డ్వాక్రా గ్రూపు మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మూగ జీవాలను ఆదుకోవాలి

మణికొండ: రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మూగ జీవాలకు తాగునీరు, ఆహారం అందించి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మణికొండ ఎనిమల్ రిస్క్ గ్రూప్ వలంటీర్లు మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్న వంద నీటి తొట్టిలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో వీధికుక్కల సంఖ్య పెరగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటికి సకాలంలో ఆహారం నీరు అందితే ప్రజలతో ప్రేమగా ఉంటాయన్నారు. నీటి తొట్టిల్లో సమీపంలో ఉన్న వారు నీటిని నింపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇన్‌చార్జి నవీన్‌తో పాటు వలంటీర్లు పాల్గొన్నారు.



తొట్టిలో నీళ్లు పోస్తున్న కమిషనర్ ప్రదీప్‌కుమార్

ఎంజీఐటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై సదస్సు

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెజాన్ వెబ్ సర్వీసెస్ శిక్షణ ద్వారా విద్యార్థులు రాబోయే రోజుల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మీద పట్టు సాధించి ఉద్యోగాల్లో జరిగే పోటీల్లో ముందు వరుసలో నిలిచే అవకాశం ఉంటుందన్నారు. ఈ సదస్సు వారం రోజుల పాటు కొనసాగుతుందని, విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సీఆర్‌కే రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న సంస్థ, ఎంజీఐటీ ప్రతినిధులు

కాలనీల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌ను కలిసిన మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు

మణికొండ: కాలనీల్లో ఉన్న రోడ్లు, మురుగునీరు, వీధి దీపాలు, పార్కుల నిర్వహణ, అభివృద్ధి తదితర సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్‌ను హుడా కాలనీ, మారుతీనగర్ కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు కోరారు. సోమవారం కమిషనర్‌గా నియమితులైనందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో కలిసి ఆయనను సన్మానించి తమ కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. త్వరలోనే కాలనీల వారీగా పర్యటించి సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ ఎల్. వందన నగేష్, హుడా కాలనీ సంక్షేమ సంఘం, మారుతీనగర్ కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి అత్యంత శక్తివంతమైనది

బండ్లగూడ: స్త్రీ శక్తి అన్ని శక్తుల్లో అత్యంత శక్తివంతమైనదని అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ సన్‌సిటీలోని కేకే కన్వెన్షన్‌లో సోమవారం మహిళా శక్తి సమేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో ఆమె మాట్లాడుతూ.. మహిళలు నాయకత్వం వహించే చోట ఫలితాలు ఎంతో ప్రయోజకరంగా ఉంటాయని తెలిపారు. గత ఏడాది భారతదేశం జీ20 సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిందన్నారు. జీ 20 అతి ముఖ్యమైన అంశం జీ20 ఎంపవర్ అని, ఇది మహిళలపై దృష్టి సారించిందని తెలిపారు. జీ 20 దేశాలలో మహిళా సాధికారిత సమూహాలు ఉన్నాయని తెలిపారు. మహిళా శ్రామిక శక్తిని మెరుగుపరచడం దీని ప్రధాన లక్ష్యమన్నారు. జీ 20 సాధికారతకు చైర్‌గా ఉన్నానన్నారు. కష్టపడి పని చేసే మహిళలను ఆదుకోవాలన్నారు.



మాట్లాడుతున్న సంగీతారెడ్డి

సమస్యల పరిష్కారానికి పరిశోధనలు అవసరం

మణికొండ: సమస్యల పరిష్కారానికి పరిశోధనలు ఎంతో అవసరమని, వాటికి ప్రభుత్వాలు చాలా నిధులు ఖర్చు చేస్తున్నాయని, వాటిపై విద్యార్థులు దృష్టిపెట్టినపుడే జీవితంలో రాణిస్తారని డిఫెక్ట్ మెటలాజికల్ రీసెర్చ్, లాబరేటరీ(డీఎంఆర్ఎల్) డైరెక్టర్, సైంటిస్ట్ డాక్టర్ ఆర్.బాలమురళీ కృష్ణన్ అన్నారు. గండిపేటలో చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాలలో సోమవారం నుంచి జాతీయ స్థాయి టెక్నికల్ ఫెస్టివల్ సుధీ–2024 ప్రారంభమయ్యింది. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పర్యావరణం స్థిరత్వం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచన, పరిశోధనలు చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మన సమాజం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లను యువ ఇంజినీర్లు పరిష్కారం చూపాల్సి ఉందన్నారు. గౌరవ అతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ ఎం.కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక సవాళ్లను స్వీకరించి వాటికి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు మాట్లాడుతూ.. ఇలాంటి టెక్నికల్ ఫెస్ట్‌లతో విద్యార్థులు తమ నెట్‌వర్క్‌ను విస్తరించుకోవటంతో పాటు ఇతరుల నైపుణ్యాలను తెలుసుకోవడం, తమ నైపుణ్యాలకు మరింత పదును పెట్టుకునేందుకు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సుధీ–2024 చైర్మన్ ప్రొఫెసర్ పి.ప్రభాకర్ రెడ్డి, విద్యార్థి సంఘం అధ్యక్షుడు దృవ్‌సక్సేనా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీబీఐటీలో సుధీ-2024 ప్రారంభోత్సవంలో అతిథులు

ఘనంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు

బండ్లగూడ: చేవెళ్ల నియోజకవర్గం మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రెడ్డి మెరిట్, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి ఈటల రాజేందర్ హాజరయ్యారు. పాఠశాలల విద్యార్థుల మధ్యలో కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, శేరిలింగంపల్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్‌యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి, సామాజికవేత సరోజ్ బజార్, కొండ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిపై రూపొందించిన ప్రత్యేక పాటను ఆవిష్కరించి రాజకీయ, సామాజిక జీవితానికి సంబంధించిన వీడియో డాక్యూమెంటరీని అభిమానులు ప్రదర్శించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

శుభాకాంక్షల వెల్లువ..

శంషాబాద్ రూరల్: విశ్వేశ్వర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా మండలానికి చెందిన బీజేపీ నాయకులు ఆయనకు సోమవారం శుభాకాంక్షలు తెలియజేశారు. కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ నాయకులు నవారు కల్యాణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు సన్మానం

రాజేంద్రనగర్: వనస్థలిపురంలో ఆత్మీయ సత్కారంలో పాల్గొన్న త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనా రెడ్డిని సోమవారం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, జాతీయ అర్టికల్చర్ బోర్డు మెంబర్ వానివల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.కాంతారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.ఉపేందర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డి.రవి కుమార్, జి.వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

శంషాబాద్: జర్నలిస్టుల రైల్వేపాసులను పునరుద్ధరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం రైల్వే డివిజన్ మేనేజర్ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. కోవిడ్ సమయం నుంచి జర్నలిస్టుల రైల్వే పాసులు కొనసాగడం లేదని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు దేవేందర్, భానుగౌడ్ ఆయనకు విన్నవించారు. వృత్తి సంబంధిత పనుల్లో వేలాది మంది జర్నలిస్టులు పాసులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర సర్కారు దృష్టికి తమ విన్నపాన్ని తీసుకెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు సుదర్శన్, చారి, శ్రీనివాస్, గోపాల్ తదితరులున్నారు.



నర్సరీలను సందర్శించిన ఉద్యాన వన విద్యార్థులు



ఏజీవర్సిటీ: శ్రీకొండా లక్ష్మణ్ ఉద్యాన వన విశ్వవిద్యాలయం విద్యార్థులు కోర్స్‌లో భాగంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ జీడిమెట్ల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ ములుగు, గ్రోమోర్ నర్సరీ ములుగును సందర్శించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్విన్‌కుమార్, డాక్టర్ మజ్జిగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శన చేశారు. ఈ సందర్భంగా వివిధ కూరగాయల మొక్కల ఉత్పత్తి వాటి పరిరక్షణ చర్యలపై వివరించారు. దీంతో పాటు నారుమళ్లల్లో చేపట్టాల్సిన వివిధ ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులను పాలీహౌస్, షెడ్ నెట్, టన్నెల్‌లలో నర్సరీల మొక్కలను పెంచే విధానాన్ని ఉష్ణోగత తేమ శాతాన్ని సేంద్రియ ఎరువులను విద్యార్థులకు వివరించారు. ప్రధానంగా నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని వాటికి తగు రీతిలో విత్తన శుద్ధిని అవలంభించాలని సూచించారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి పల్టీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయాలకు గురయ్యాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై చోటు చేసుకుంది. మెహిదీపట్నం నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లేందుకు పీవీ నరసింహా రావు ఎక్స్‌ప్రెస్ వే నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటల ప్రాంతంలో ఓ వ్యక్తి కారులో వెళ్తున్నాడు. వేగంగా దూసుకొచ్చిన ఆ వాహనం పిల్లర్ నంబర్ 296 వద్దకు రాగానే అదుపుతప్పి పల్టీ కొట్టి పక్కనే ఉన్న రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఈ ఘటన సమయంలో అటు ఇటుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వాహనంలోని బెలూన్‌లు ఓపెన్ కావడంతో వాహనం నడిపిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని స్థానికుల సాయంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాడు. సాయంత్రానికి ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వాహనాన్ని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



కల్యాణం.. కమనీయం



మణికొండ: కామేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీలోని శారదా చంద్రమౌళీశ్వర, వేంకటేశ్వర స్వామి ఆలయం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం ఉదయం సూర్య నమస్కారం, చండీ పారాయణం, శ్రీ కామేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి అష్టోత్తర శత కలశాభిషేకం, కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గణపతి హోమం, ఆయుష్యహోమం, రుద్రహోమం, లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను నిర్వహించారు. వేద మంత్రోశ్చరణలతో సెక్రటేరియట్ కాలనీ మారుమ్రోగుతుంది.

సెల్‌ఫోన్ అప్పగింత

శంషాబాద్ రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి బాధితుడుకి అందజేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ననాజీపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్ రూ.30వేల విలువ చేసే మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఎస్ఐ రాజ్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ లింగమూర్తి మొబైల్ ఫోన్‌ను గుర్తించి సోమవారం బాధితుడికి అందజేశారు.

క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి



ఏజీవర్సిటీ: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సిబ్బందికి క్రీడలను సోమవారం ప్రారంభించారు. క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగుపడేలా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక క్రీడలో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం

మణికొండ: మున్నూరు కాపు జర్నలిస్ట్ జిల్లా కన్వీనర్‌గా మణికొండకు చెందిన జి.విజయ్‌కుమార్‌ను నియమించారు. సోమవారం రాష్ట్ర మున్నూరు కాపు జర్నలిస్ట్ ఫోరం(టీఎంకేజేఎఫ్) వ్యవస్థాపకుడు కొత్తా లక్ష్మణ్ పటేల్ ఈ మేరకు నియామకపు ఉత్తర్వులు జారీ చేసినట్టు విజయ్‌కుమార్ తెలిపారు. గండిపేట మండలానికి విలేకరిగా పనిచేస్తున్న విజయ్‌కుమార్ మున్నూరు కాపు విలేకర్ల శ్రేయస్సు కోసం కృషి చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో త్వరలోనే పూర్తి స్థాయి కమిటీని నియమించాలన్నారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తనకు జిల్లా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పూర్తి స్థాయిలో సంఘాన్ని బలోపేతం చేస్తానన్నారు.

కోనోకార్పస్ చెట్లను తొలగించాలి

శంషాబాద్: పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను వెంటనే తొలగించాలని ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ ఎస్ఎఫ్‌డీ కో కన్వీనర్ ప్రదీప్ మాట్లాడుతూ..కోనోకార్పస్ చెట్లను శాస్త్రవేత్తలు తొలగించాలని సూచించినప్పటికీ ఆయా స్థానిక సంస్థల అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లక్షల సంఖ్యలో ఉన్న కోనోకార్పస్ చెట్ల వల్ల మానవాళికే కాకుండా జంతువులకు సైతం ప్రమాదం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా పెరిగిన చెట్లకు కాసిన విత్తనాలతో మరిన్ని చెట్లు పెరుగుతున్నాయన్నారు. తొలగించాలని ప్రభుత్వం సూచించినా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు.